

## ముక్కుసూటి మనిషి..
## బాసాని చంద్రప్రకాశ్

- పట్టువదలని గుణం ఆయన సొంతం
- రాజకీయాల్లో తనదైన ముద్ర
- మొండిఘటంగా పేరు సార్థకం
- పద్మశాలి సంఘం రాష్ట్ర సలహాదారుడిగా ప్రత్యేక గుర్తింపు
- రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియామకం

5లో..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 88
పేజీలు : 06 | వెల: రూ.5/-
శనివారం
డిసెంబర్ 21, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




వివరాలు 2లో..

# మానవత్వం లేదా..!



## అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన రేవంత్‌రెడ్డి

కొన్నికొన్ని సంఘటనలు చూస్తే మనసు చలించిపోతుంది.. అసలు సమాజం ఎటువైపు పోతుందని బాధేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అసెంబ్లీలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం పుష్పా-2 సినిమా బెన్‌ఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన సంఘటనపై సీఎం తీవ్రంగా స్పందించారు. బెన్‌ఫిట్ షోకు వస్తే జనం కిక్కిరిసి ఉంటారన్న కనీసం జ్ఞానం లేకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా థియేటర్‌కు రావడం ఒక ఒక పొరపాటైతే, ఒక మహిళ చనిపోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మారక స్థితిలో ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా అక్కడే ఉండి సినిమా చూస్తాననడం మరో పొరపాటన్నారు. సెలబ్రిటీలకు ఏమైనా ప్రత్యేక చట్టాలు ఉంటాయా అని ప్రశ్నించారు. సినిమాలు చేసుకోండి, డబ్బులు సంపాదించుకోండి అంతేకాని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదంటూ సినీ ఇండస్ట్రీకి ముఖ్యమంత్రి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. మేం అధికారంలో ఉన్నంత వరకు మీ ఆటలు సాగవన్నారు. సినీ ఇండస్ట్రీ మానవత్వాన్ని మంటగలిపేలా వ్యవహరించిందన్నారు. మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించకుండా అల్లు అర్జున్ కు కాలుపోయిందా, కన్నుపోయిందా.. ఆయనను పరామర్శించేందుకు క్యూ కట్టారని విమర్శించారు. - వరంగల్ వాయిస్, వరంగల్ బ్యూరో

- పుష్పా-2 ఘటన కలిచివేసింది
- హీరోలంటే తెరపైన కాదు.. నిజజీవితంలో చూపాలి
- సెలబ్రిటీలకు ప్రత్యేక చట్టాలు ఉంటాయా?
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు
- సినీ ఇండస్ట్రీకి సీఎం సీరియస్ వార్నింగ్



6లో..

## భూములు ఇచ్చేదేలేదు

- ఆరెపల్లిలో అన్నదాతల ఆందోళన
- బైపాస్ రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు
- అధికారులతో వాగ్వాదం
- పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో వెనుదిరిగిన అధికారులు



2లో..

## ఘనంగా గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి

- కొనియాడిన ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో గణిత ఎగ్జిబిట్స్



6లో..

## పల్లెల నుంచే ప్రపంచ స్థాయి క్రీడాకారుల తయారీ

- అందుకే సీఎం కప్ టోర్నమెంట్
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



4లో..

## ప్రజలతో ఉంటా..

- పదవులు ముఖ్యం కాదు
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# మానవత్వం లేదా..!

- **పుష్పా-2 ఘటన కలిచివేసింది**
- **హీరోలంటే తెరపైన కాదు.. నిజజీవితంలో చూపాలి**
- **సెలబ్రిటీలకు ప్రత్యేక చట్టాలు ఉంటాయా?**
- **ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు**
- **సినీ ఇండస్ట్రీకి సీఎం సీరియస్ వార్నింగ్**
- **అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన రేవంత్‌రెడ్డి**



**వరంగల్ వాయిస్, వరంగల్ బ్యూరో :** పుష్పా–2 సినిమా బెన్‌ఫిట్ షోలో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందడంతోపాటు వారి కుమారుడు అపస్మారక స్థితిలోకి చేరినా హీరో అల్లు అర్జున్ ఇవేమీ పట్టించుకోకుండా అక్కడే ఉండి సినిమా చూస్తానంటూ పట్టుపట్టడం దేనికి సంకేతమని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సమాజం ఎటువైపు పోతుందంటూ భావోద్వేగానికి గురయ్యారు. సంధ్య థియేటర్ లో జరిగిన సంఘటనను ముఖ్యమంత్రి అసెంబ్లీలో వివరించారు. ఇప్పటికే ఒకరు చనిపోయారు, మరొకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది..త్వరగా మీరు ఇక్కడినుంచి వెళ్లి పోవడం మంచిది.. లేకుంటే మరింత ప్రమాదం జరుగుతుందంటూ పోలీసులు హెచ్చరించినా అల్లు అర్జున్ పట్టించుకోలేదన్నారు. వెళ్లకపోతే అరెస్టు చేయాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేయడంతో తిరుగుముఖం పట్టాల్సి వచ్చిందన్నారు. అది కూడా వెళ్లే సమయంలో ఓపెన్‌టాప్ జీపులో చేతులు బయటకు ఊపుతూ కనీసం ఎవరు చనిపోయారు, ఎవరు గాయాలపాలయ్యారు అని చూడకుండా ఉండటం ఎంత వరకు సబబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## ప్రమాదపుటంచుకల్లో కుమారుడు..

సంధ్య థియేటర్ లో జరిగిన తొక్కిసలాటలో రేవతి మృతి చెందగా అమె కుమారుడు అపస్మారక స్థితిలోనే ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఇప్పటికీ ప్రమాదంలో గాయపడిన బాబు పరిస్థితి ఆందోళన కరంగా ఉందన్నారు. సినిమా చూద్దామని వచ్చిన పాపానికి పుష్పా–2 ఒక కుటుంబాన్ని వీధిన పడేసిందన్నారు. కుటుంబంలో ఒకరిని కోల్పోయి, మరొకరు అపస్మారక స్థితిలో ఉన్నా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు కనీసం మానవత్వం చూపలేదన్నారు. పరామర్శించాల్సిన బాధ్యత వారికి లేదా అని ప్రశ్నించారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. సినిమా రిలీజ్ సమయంలో జరిగిన తొక్కిసలాటలో సామాన్యుల ప్రాణాలు పోతే వాటిని ఇండస్ట్రీ పెద్దలు పట్టించుకోరా అన్నారు. వారివి ప్రాణాలు కాదా అని నిలదీశారు.



## అల్లు అర్జున్ కు పరామర్శలు..

ఒక్కరోజు జైలులో ఉన్నందుకే అల్లు అర్జున్‌కు పదుల సంఖ్యలో పరామర్శలు, ప్రభుత్వంపైన విమర్శలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ కు కాలుపోయిందా, కన్నుపోయిందా.. ఏమైనా గాయపడ్డారా..? మరేమైనా జరిగిందా..? అని నిలదీశారు. ఒక్క రోజు జైలులో ఉంటేనే మీకు అలా ఉంటే అక్కడ ఒకరి ప్రాణం పోయింది..అభం శుభం తెలియని చిన్నారి కోమాలోకి వెళ్లిపోతే బాధ కలగదా అని అన్నారు. అల్లు అర్జున్‌ను కావాలనే ప్రభుత్వం అరెస్టు చేసిందని పదేళ్లు పాలించిన ఒక నాయకుడు ట్విటర్‌లో ఇష్టం వచ్చినట్లు కామెంట్లు పెడుతున్నారని, సమాజం ఎటువైపు పోతుందని ఆయనకు కనీస మానవత్వం కూడా లేదా అని ప్రశ్నించారు. అదే మన ఇంట్లో ఇలాంటి ఘటన జరిగితే మనం ఊరుకుంటామా అని నిలదీశారు.

## వారికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయా..

సెలబ్రిటీలను, సినీ హీరోలను అరెస్టు చేయవద్దని ఏమైనా చట్టాలు ఉన్నాయా అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన చట్టం ప్రకారం పోలీసులు నడుచుకుంటారని వారు రాజకీయ నాయకులా.. సినీ హీరోలా అని చూడరని గుర్తు చేశారు. నిజంగా హీరోలంటే తెరపైన కాదు నిజజీవితంలో ఎలా ఉండాలో చూపిస్తే అభిమానులకు మేలు జరుగుతుందని హితవు పలికారు. ఇప్పటికైనా అర్థంపర్థంలేని కామెంట్లు చేయకుండా కనీస మానవత్వాన్ని చాటుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## ఇలాంటి ఘటనలు ఎవరూ హర్షించరు : అక్బరుద్దీన్

సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనను మానవత్వం ఉన్న ఎవరూ హర్షించరని, దానికి బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారు. మనకు పిల్లలు ఉన్నారని, ఇలాంటి ఘటనను తీవ్రంగా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. సినీ ప్రముఖులు కూడా ఆ బాలుడిని పరామర్శించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇంకా ఘటనకు బాధ్యులైన వారికే సానుభూతి పలకడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరం లేదని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

- **కొనియాడిన ఉపాధ్యాయులు**
- **పాఠశాలల్లో గణిత ఎగ్జిబిట్స్**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పలు పాఠశాలల్లో శనివారం ఆయనను కొనియాడుతూ గణిత ఎగ్జిబిట్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రపంచ మేధావిని స్మరించుకోవడం మన అందరి కర్తవ్యం అన్నారు. వరంగల్ నగరం కాశిబుగ్గలోని స్టాండర్డ్ ఉన్నంత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ అంజన్ కుమార్, ప్రముఖ సైకాలజిస్ట్ కె.రమాదేవి, పూర్వ విద్యార్థిని, రాష్ట్ర స్థాయిలో డివిజన్ అకౌంటెంట్ ఆఫీసర్ గా మొదటి ర్యాంకు పొందిన ఎస్.విజయకుమార్, అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాకర్ రాజు గణిత ఎగ్జిబిషన్లను ప్రారంభించారు. సుమారు 50 ఎగ్జిబిట్లను ప్రదర్శించగా ఇందులో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలు శంకర్, రమేష్, అఖిల ఉత్తమ ఎగ్జిబిట్ లను ఎంపిక చేశారు.

## వాణి విద్యానికేతన్ లో..

ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సామల స్వరూప అన్నారు. పాఠశాలలో వందకు పైగా ఎగ్జిబిట్ లను ఏర్పాటు చేయగా విద్యార్థులతోపాటు, వారి తల్లి దండ్రులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సామల సుధాకర్, సామయ మురళీ కృష్ణ, సామల సాయికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదే విధంగా 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్, ఎల్ బి నగర్ లోని మాసూమ్ అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల, కరీమాబాద్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల విద్యాలయంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.











# భూ నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటాం

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వి ని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామంలో పాలకుర్తి నియోజకవర్గంలోని దేవాదుల భూ నిర్వాసితులకు ప్యాకేజ్ (6) ద్వారా నిధుల మంజూరి పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి ఎంఎల్ఏ యశస్విని ఝాన్సీ రెడ్డి హాజరై చెక్కులు పంపిణీ చేశారు. 250 మంది దేవాదుల భూ నిర్వాసితులకు నష్టపరిహారంగా మంజూరైన 11 కోట్ల 40 లక్షల రూ న్యాయపరంగా పంపిణీ చేశారు. రు.ఈ ప్యాకేజ్ ద్వారా భూ నిర్వాసితులకు ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, వారి జీవనోన్నతికి అవసరమైన అన్ని విధాల సహకారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రగతి దిశగా ముందడుగు వేయిస్తాయి. అయితే, ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభావితమైన ప్రజల హక్కులు, జీవితోపాధి నష్టపోకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. భూమి కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించటం ద్వారా కొత్త జీవనశైలిని ఏర్పరచుకునే అవకాశం కల్పించడం. అవకాశాలు, మరియు సమగ్ర పునరావాస పథకాలు అందించడం జరుగుతుంది అని అన్నారు. ఈ ప్యాకేజ్ (6) ద్వారా పారదర్శక విధానం ద్వారా నిధుల పంపిణీ జరుగుతుందని, ప్రతి నాయమైన వ్యక్తికి ఇది ఉపయోగకరమవుతుందని చెప్పారు. భూ నిర్వాసితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కీలక కార్యక్రమం న్యాయబద్ధతతో కూడిన అభివృద్ధి పునాది వేస్తుందని వారు స్పష్టం చేశారు.. భూ నిర్వాసితుల కష్టాలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషిస్తుందని, నిధుల పంపిణీ సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు స్ఫూర్తి కలిగించే కార్యక్రమమని అభివర్ణించారు. ఈ పథకం విజయవంతం కావడంలో ప్రతి ఒక్కరి సహకారం ముఖ్యమని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయపడతామని హామీ ఇచ్చారు. భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ అసలు లక్ష్యం అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి, తొర్రూరు ఆర్డీవో, ఇరిగేషన్ ఇంజనీర్లు, ఎంపీడీఓ, బ్లాక్ అధ్యక్షులు హమ్యా నాయక్, మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, ధరావత్ సురేష్ నాయిక్, సంచు సంతోష్, సీనియర్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రంగు మురళి, డైరెక్టర్లు మన్మోహన్ రెడ్డి, పూర్ణ చందర్, గోపాల్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాసాల ప్రభాకర్, వేణు, రాజు, సోము నాయక్, సమయ్య, యువజన నాయకులు, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

**వరంగల్ వాయిస్, టేకుమట్ల:** టేకుమట్ల మండలంలో శనివారం రోజున ఎంపీపీఎస్ వెలిశాల టేకుమట్ల ప్రాథమిక పాఠశాల లో భారతీయ ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త శ్రీ నివాస రామనుజన్ జయంతి సందర్భంగా "జాతీయ గణిత దినోత్సవం" పురస్కరించుకొని ముందస్తుగా గణిత మేళాను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాలు ఎస్. తిరుపతి ఆధ్వర్యంలో విద్యార్థులు గణిత విషయాని సంబందించిన చతర్విద ప్రక్రియలు, స్థాన విలువలు, కాలం, కాలమానిని త్రిమితీయ ఆకారాలు, బరువులు, లకు సంబందించిన ప్రదర్శనలను ప్రదర్శించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాదకాలి చిదురాల సుధాకర్ గారు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ పూరెల్ల రమాదేవి,వెలిశాల కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు ప్రసాద్, జడ్పీఎస్ వెలిశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పిల్లల తల్లి తండ్రులు మరియు ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాద్యాయులు మేళాలో పాల్గొని పిల్లల ప్రదర్శనలు తిలకించి అభినందించారు.




### కాశిబుగ్గలో..

**వరంగల్ వాయిస్ కాశీబుగ్గ, వరంగల్:** కాశిబుగ్గలోని బిట్స్ అశ్మక ఉన్నత పాఠశాలలో శనివారం రోజున "జాతీయ గణిత దినోత్సవము" ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డా రాజేంద్రప్రసాద్ రెడ్డి హాజరై డిసెంబర్ 22న గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశమంతా ఈ రోజున మాథ్స్ డేను జరుపుకుంటారని, గణితంలో శాస్త్రీయమైన శిక్షణ లేకపోయినా గణిత విశ్లేషణ, సంఖ్యాశాస్త్రం, అనంత శ్రేణులు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేశారని, గణిత శాస్త్రంలో అనేక పరిశోధనలు చేశారని, కీలకమైన సిద్ధాంతాలను ఆవిష్కరించాలని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు. విద్యార్థులు మ్యాథ్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్ ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ ఫ్రీ రన్ లో పాల్గొన్న ఝాన్సీ రెడ్డి

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డు జల విహార్ దగ్గర నిర్వహించిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ 2కే రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ మానవ జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో వివరించారు. యువత మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉండాలని, అవి వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా పెనుముప్పుగా మారతాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, నిర్వాహకులు, ప్రముఖులు తదితరులు, పాల్గొన్నారు.

## మోరంచ మాటులో మునిగి రైతు దుర్మరణం



**వరంగల్ వాయిస్, గణపురం:** డిసెంబర్ 21 మండలంలోని బసవరాజుపల్లి వద్ద శుక్రవారం రాత్రి దామనపల్లి బాబురావు అనే వృద్ధుడు మోరంచ మాటులో మునిగి దుర్మరణం చెందాడు. శుక్రవారం సాయంత్రం పొలంలో నీరుపారించడం కోసం మోరంచ మాటు వద్దకు వెళ్లి నీళ్లు పారిస్తున్న క్రమంలో అందులో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు నాలుగేళ్ల క్రితం మృతుని భార్య వినోద కరోనాతో మరణించగా వయసుకు వచ్చిన ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉండగా వారికి వివాహం జరిగినట్లు స్థానికులు తెలిపారు.కాగా విషయం తెలుసుకున్న ఎస్సై రేఖ అశోక్ శవపంచాయితీ నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం కోసం భూపాలపల్లి వంద పడకల ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రేఖ అశోక్ వివరించారు.



## అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమీత్ శా చేసిన వ్యాఖ్యలనుఉపసంహరించుకుని దేశ ప్రజలకుక్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని గిరిజన సంఘాల నేత వివేక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్అంబేడ్కర్ ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమీత్ షా చేసిన వ్యాఖ్యలనునిరసిస్తూ దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరసర్యాలి చేపట్టి అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అమిత్ షా కు వ్యతిరేక నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించిన దళిత...గిరిజన సంఘాలు. వివేక్ మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానించడమేనని, ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత.గిరిజన సంఘాల నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల

### చర్లపల్లి పాఠశాల లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



**వరంగల్ వాయిస్ నడికూడ:** మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం ఫుడ్ ఫెస్టివల్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చర్లపల్లి మాజీ సర్పంచ్ చాడ తిరుపతి రెడ్డి హాజరై ప్రతిరోజు పిల్లలకు పౌష్టికరమైన ఆహారాన్ని చిన్నప్పటి నుంచి అందించినట్లయితే పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని అన్నారు. ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే అన్ని రకాల కూరగాయలను, ఆకుకూరలను ,పప్పులను తినే విధంగా రుచికరమైన భోజనాన్ని అందించాలని, అప్పుడే వారి మానసిక ఎదుగుదల బాగుంటుందని, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి ఫుడ్ ఫెస్టివల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లులు తెచ్చిన వివిధ రకాల వంటకాలను పరిశీలించి బాగున్నాయని కితాబిచ్చారు. ఫుడ్ ఫెస్టివల్ లో బిర్యాని, చికెన్, వెజిటేబుల్ బిర్యాని, పులిహోర, దద్దోజనం, బెల్లన్నం,కరివేపాకు రైస్, గోంగుర పచ్చడి వివిధ రకాల కూరగాయల తో తయారు చేసిన కూరలు ,రాగిసంకటి, సర్వపిండి, పేలాల ముద్దలు, విద్యార్థుల తల్లులు తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బత్తుల రవీందర్, కంచ రాజు కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, తల్లిదండ్రులు పున్నం చందర్, మహేందర్, శివకుమార్, హరిత, నాగరాణి, స్వప్న, కవిత, సుచిత, కోమల, రమ ప్రవళిక, స్రవంతి, శివాని, అంజలి, పాల్గొన్నారు.

# పదవున్నా లేకున్నా ప్రజలతో ఉంటా..

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** పదవనేది శాశ్వతం కాదని పదవున్నా..లేకున్నా.. ప్రజలతో ఉంటా..ప్రజల్లోనే ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు అన్నారు.శనివారం పరకాల పట్టణంలోని ఆర్.ఆర్.గార్డెన్స్ పోచంపల్లి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుమిషన్ ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి గారితో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పరకాల మరియు దామెర మండలాలకు చెందిన 650 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందచేసారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ.. పదవున్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటానని అన్నారు. సంవత్సర కాలంగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకే శిలాఫలకాలు పెట్టె పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు.సంగెం,గీసుగొండ శివారులో కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు భూసేకరణకు రైతుల సహకారం ఎంతో ఉందని,వారి సహకారంతోనే 1350 ఎకరాల భూమి సేకరణ చేయడం జరిగిందన్నారు. భూమి కోల్పోయిన రైతులకు మంచి ధర కల్పించడమే కాకుండా ఎకరాకు 100 గజాల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. వస్త్ర పరిశ్రమలో ఏర్పాటవుతున్న కంపెనీలలో శిక్షణ పొందిన మీ అందరికి ఉపాధి కల్పిస్తామని అన్నారు. అందుకోసమే నియోజకవర్గంలో ఉచితంగా కుట్టుమిషన్ లో శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు.అందుకు సహకరించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు. మీకిచ్చిన కుట్టు మిషన్లతో మీ కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగ ఉండేలా పనిచేసుకోవాలని మహిళలకు సూచించారు. త్వరలోనే మిగిలిన గ్రామాల మహిళలలకు కుట్టు మిషన్లు అందచేస్తామన్నారు.అదేవిధంగా ఆత్మకూరు,గీసుగొండ,సంగెం మండలాలలో కూడా ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని తెలిపారు.

### ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..

ఇంత గొప్పగా కార్యక్రమ ఏర్పాటుకు కృషి కమిటీ సభ్యులకు అభినందిస్తున్న. జనగామలో ఏర్పాటుచేయాల్సిన కుట్టుమిషణ్ శిక్షణ కేంద్రాలను చల్లా ధర్మారెడ్డి గారి కోరిక మేరకు పరకాల నియోజకవర్గంలో ఏర్పాటుచేయడం జరిగింది. ఎవరైతే కుట్టుమిషన్ శిక్షణ పొంది సర్టిఫికెట్ పొందుతారో వారికే కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికూడ,పరకాల పట్టణ, దామెర మండలాల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

### దుర్గయ్య కుంటుబానికి పరామర్శ..

**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పట్టణ బిఆర్ఎస్ మహిళా నాయకురాలు అల్లం సుమలత తండ్రి అల్లం దుర్గయ్య గారు ఆకాల మరణం చెందగా విషయం తెలిసిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, దుర్గయ్య పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను



అడిగి తెలుసుకున్నారు. దుర్గయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.ఆయన వెంట పరామర్శించిన వారిలో కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# ధ్యానంతో ఏకాగ్రత

## మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ధ్యానంతో ఏకాగ్రత పెంపొందుంతుందని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా వడ్డేపల్లి బండ్ పై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ధ్యానం మనిషి జీవితంలో అనేక మార్పులకు దోహదపడుతుందన్నారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతా లభిస్తుందని, ప్రతీ ఒక్కరి జీవన శైలిలో ధ్యాన ప్రక్రియను భాగం చేసుకోవాలన్నారు. యోగ, ధ్యాన ప్రక్రియకు ప్రపంచ గుర్తింపు తీసుకొచ్చింది భారతదేశమేనని అని గుర్తు చేశారు. వరల్డ్ మెడిటేషన్ డే నిర్వాహకులకు శుభాకాంక్షలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందానికి ధన్యవాదములు తెలిపారు.

### పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో..

ప్రపంచ ధ్యాన దినోత్సవంలో భాగంగా శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పోలీస్ అధికారులు ఘనంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. నిత్యం ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని ఏసీపీ నాగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, మెడిటేషన్ ట్రైనర్ సునీతతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేయూలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



**వరంగల్ వాయిస్, కేయూ :** 'రోజువారీ జీవనంలో గణితం ప్రధాన భూమిక'పోషిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఆర్.భారవి శర్మ అధ్యక్షతన శని వారం విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర విభాగ సెమినర్ హాల్ లో శ్రీనివాస రామానుజం అయ్యంగార్ 137 వ జయంతి సందర్భంగా ముందస్తు జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను, పరిశోధకులను, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇతర శాస్త్ర అభివృద్ధికి గణితం కారణం అన్నారు. మన మేధస్సు, మెదడును ఉపయోగించే ఆలోచన విధానంతో ఒక సామాన్య వ్యక్తి కుడా గణితం అన్వహిస్తున్నాడన్నారు. ఎన్ఐటీ గణిత శాస్త్ర విభాగ సహా ఆచార్యులు డాక్టర్ ఈ.సత్యనారాయణ 'డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, అప్లికేషన్స్' అనే అంశం విస్తృత ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుమలదేవి, డాక్టర్ ఎల్.పి.రాజ్ కుమార్, డాక్టర్ బి.ఎస్.ఎల్. సౌజన్యతో పాటు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రామానుజం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను జిల్లాలో మరింత విస్తృతం చేయాలి





## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు మరియు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధ్యక్షతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి శనివారం ఐ.డి.ఓ.సి లోని కలెక్టర్ చాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మహబూబాబాద్ ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను అభినందించారు. ముఖ్యంగా సెప్టెంబర్ నెలలో వరద బాధితులకు వారి గ్రామాలను సందర్శించి అత్యవసర సరుకులు, దుప్పట్లు, ఉన్ని దుప్పట్లు, వంట సామాగ్రి, దుస్తులు సకాలంలో అందచేశారని,జిల్లాలోనిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమాలపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ లో సరిపడా రక్త నిల్వలు లేవని యువత ముందుకు వచ్చి మరిన్ని రక్త దాన కార్యక్రమాలు నిర్వహించాలని, స్వచ్ఛంద సంస్థలు మరియు యువజన సంఘాల వారితో సమావేశం నిర్వహించాలని సూచించారు. మహబూబాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ ఆదివాసీ మండలాల్లోని వృద్ధులకు చలి మరియు వర్షాల నుండి రక్షణగా దుప్పట్లు, దోమతెరలు టార్పాలిన్ లు, హైజీన్ కిట్స్ అందచేయటం మంచి కార్యక్రమం అని అన్నారు. టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి పోషక విలువలు కలిగిన పదార్థాలు గతంలో వలే మరి ఒక్కసారి ఇవ్వాలని తెలిపారు. గంగారం మండలంలోని 15 నుండి 20 సంవత్సరాల చిన్నారులకు పోషకాహారం అందచేయలని సూచించారు.గతంలో రాష్ట్ర గవర్నర్ మరియు రెడ్ క్రాస్ అధ్యక్షులు మహబూబాబాద్ జిల్లాకు ఇచ్చిన అవార్డులను, ప్రశంస పత్రాలు ఒక ప్రత్యేక కార్యక్రమంలో అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి. వర ప్రసాద్ , వైస్ చైర్మన్ డాక్టర్ నెహ్రూ , కోశాధికారి మాధవ పెద్ది వెంకట్ రెడ్డి, ఎంసి సభ్యులు గొర్రె వెంకన్న, విశ్వేశ్వర రావు, డాక్టర్ సూర్య కుమారి, న్యాయ సలహా దారు కొండపల్లి కేశవరావు పాల్గొన్నారు.



# అక్రమాలు బయట పడతాయనే అసెంబ్లీ అడ్డంగింత


## - సాయిలి ప్రభాకర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ ల తీవ్రమైన నేరాలు బయటపడకుండా ఉండేందుకే అసెంబ్లీ సమావేశాల్ని జరగనీయకుండా అడ్డుకుంటున్నారని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ ఆరోపించారు. వారి పాలనలో కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము దోపిడీ, ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. వారి భూబాగోతాలు, అక్రమాలు వెలుగు చూస్తాయని భయపడుతున్నారన్నారు. స్పీకర్ పైకి పోయి విధ్వంసాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. చేసిన అక్రమాలు ఎప్పుడైనా బయటపడతాయని, శిక్ష తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సహకరించాలన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉండే విధంగా ప్రభుత్వానికి సహకరించాలని ప్రభాకర్ కోరారు.



# పంచాయతీ కార్మికుని కుటుంబానికి ఎంపీఓ పరామర్శ

**వరంగల్ వాయిస్ నడికూడ:** మండలంలోని నర్సక్క పల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ కోడెపాక రాజయ్య కుటుంబ సభ్యులను శనివారం రోజున మండల పంచాయతీ అధికారి సి చేతన్ కుమార్ రెడ్డి పరామర్శించారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చెల్లించాల్సిన పదివేల రూపాయల నగదును మధుకర్ కు ఎంపీ ఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్ విద్యాసాగర్, మల్టీపర్పస్ వర్కర్ల సంఘం నడికుడ మండలాధ్యక్షుడు రామన్న,ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేష్, కారోబార్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టువదలని గుణం.. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే నైజం.. తండ్రి నుంచి కాంగ్రెస్ భావజాలాన్ని పునికి పుచ్చుకొని సమస్యలపై పోరాడే గుణం ఆయన్ని ప్రజాప్రతినిధిగా నిలబెట్టింది. గ్రామ సర్పంచి నుంచి మండల పరిషత్ అధ్యక్షుని వరకు... మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నుంచి.. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సలహాదారుని వరకు అనేక పదవులు పొంది నిస్వార్థ సేవకుడిగా పేరు గడించారు. ఆయనే.. బాసాని చంద్రప్రకాశ్.





గడ్డం కేశవమూర్తి

# ముక్కుసూటి మనిషి.. బాసాని చంద్రప్రకాశ్

- పట్టువదలని గుణం ఆయన సొంతం
- రాజకీయాల్లో తనదైన ముద్ర
- మొండిఘటంగా పేరు సార్ధకం
- పద్మశాలి సంఘం రాష్ట్ర సలహాదారుడిగా ప్రత్యేక గుర్తింపు
- రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియామకం

**బాసాని చంద్రప్రకాశ్ సేవలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఇటీవల రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియమించింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో చంద్రప్రకాశ్ ను ఈ పదవి వరించింది. నిజాన్ని నిర్భయంగా చెప్పడమే ఆయన నైజం కావడంతో రాజకీయాల్లో అనేక ఆటుపోట్లను చవిచూడాల్సి వచ్చింది. మొండిఘటంగా పేరు సార్ధకమైనప్పటికీ ఆయన తను నమ్మిన దారి వీడలేదు. పట్టింపుల మనిషి కాబట్టే నమ్మిన విలువల కోసం నిలుచున్నాడు. ఈ సందర్భంగా ఆయన 'వరంగల్ వాయిస్'తో తన అనుభవాలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..**

### ప్రజల్లో ఒకడిగా..

ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన శాయంపేట ఏళ్ల తరబడి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నది. ఎందరో ప్రజాప్రతినిధులు ఇక్కడి నుంచి అందలం ఎక్కినప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహాయ సహకారాలతో అభివృద్ధికి బాటలు పడ్డాయి. ఆయన మార్గనిర్దేశంలో శాయంపేట ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు దక్కింది. తొలి నుంచి మాది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. మా నాన్న బాసాని కైలాసం సుదీర్ఘకాలం శాయంపేట గ్రామ సర్పంచిగా, చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ కాలంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు అంతా మా ఇంటికి వచ్చి వెళ్లేవారు. పార్టీ నిర్వహించే సభలు, సమావేశాలకు మా నాన్నతో కలిసి నేను వెళ్లేవాడిని. కాంగ్రెస్ భావజాలంతో ప్రజా సమస్యలపై చిన్ననాటి నుంచే స్పందించే గుణం నాకు అలవాటయింది. ప్రస్తుత రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, గండ్ర వెంకట రమణారెడ్డి, ప్రస్తుత శాసనమండలి విపక్షనేత సిరికొండ మధుసూదనాచారితో కలిసి రాజకీయాల్లో నడిచాను. 2001 నుంచి 2014 వరకు ప్రత్యేక తెలంగాణ సాధన పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించాను. అనేక ప్రజా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక రాష్ట్ర సాధనలో నా వంతు కృషి చేశాను. ప్రస్తుతం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మార్గ నిర్దేశకత్వంలో పనిచేస్తూ శాయంపేటను ప్రగతి పథంలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాను. ప్రజల్లో ఉంటూ వారిలో ఒకడిగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నాను. శాయంపేట మండలంలో అనేక సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంది. విద్య, వైద్య, రోడ్లు వంటి కనీస వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నది. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధుల సహకారంతో సమస్యలను పరిష్కరించడానికి ముందుకు సాగుతున్నాను.




### బాల్యం.. కుటుంబం..

1958 ఆగస్టు 20న శాయంపేటలో బాసాని కనుక లక్ష్మి–కైలాసం దంపతులకు చంద్ర ప్రకాశ్ జన్మించారు. వరంగల్ ఎల్ బి కళాశాలలో బీఎస్సీ (పౌల్ట్రీ) చదివారు. 1980 మే 2న పరకాలకు చెందిన మాచర్ల రమాదేవిని వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె చరిత శ్రీ, కుమారుడు వినీత్ ఉన్నారు. విద్యార్థి దశలో ప్రజా సంఘాల్లో ఆయన చురుగ్గా పనిచేశారు. స్టూడెంట్ లీడర్ గా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పద్మశాలి సంఘంలో కూడా కీలకంగా వ్యవహరించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లో ఆయన వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం భవన నిర్మాణ కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. ముఖ్యంగా శాయంపేట మండలంలో చురుకైన బీసీ నేతగా ఆయనకు మంచి పేరుంది.

### రాజకీయ ప్రస్థానం..

రాజకీయాల్లో బాసాని చంద్రప్రకాశ్ ది ప్రత్యేక శైలి. 1982లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన అంచలంచెలుగా ఎదిగారు. 1992లో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులై రెండున్నర ఏళ్లు పనిచేశారు. 1995లో శాయంపేట సర్పంచిగా గెలిచి ఐదేళ్లు గ్రామాభివృద్ధికి కృషి చేశారు. 2001లో గట్ల కానిపర్తి ఎంపీటీసీగా ఎన్నికై 2006 వరకు శాయంపేట ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత శాయంపేట చేనేత సహకార సంఘం చైర్మన్ గా విధులు నిర్వహించారు. 2013నుంచి 2018 వరకు ఐదేళ్లపాటు ఆయన సతీమణి బాసాని రమాదేవి కూడా శాయంపేట ఎంపీపీగా సేవలందించారు. 2018లో చంద్రప్రకాశ్ ఎంపీటీసీగా శాయంపేట నుంచి గెలుపొంది 2023 వరకు భాధ్యతలు నిర్వహించారు. అప్పటి రాజకీయ పరిస్థితుల వల్ల ఆయనకు మరోమారు ఎంపీపీగా పని చేసే అవకాశం లభించలేదు. ప్రస్తుతం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రధాన అనుచరుడిగా, కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్ (కనీస వేతన సలహా మండలి సభ్యులు) గా నియమించింది. ఈ మేరకు రాష్ట ప్రిన్సిపల్ సెక్రటరి సంజయ్ కుమార్ ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేశారు. చంద్ర ప్రకాశ్ రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు సభ్యుడిగా నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ కు చంద్ర ప్రకాశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కనీస వేతన సలహా మండలి సభ్యుడిగా చంద్ర ప్రకాశ్ నియామకం కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పద్మశాలి కుల సంఘాల నేతలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయన్ని ఘనంగా సన్మానించారు.









# భూములు ఇచ్చేదేలేదు

- ఆరెపల్లిలో అన్నదాతల ఆందోళన
- బైపాస్ రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు
- అధికారులతో వాగ్వాదం
- పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో వెనుదిరిగిన అధికారులు



**వరంగల్ వాయిస్, ఆరెపల్లి :** వరంగల్ జిల్లా ఆరెపల్లి గ్రామ శివారులోని కొత్తపేట క్రాస్ రోడ్డు వద్ద రైతులు, నివాస స్థలాలు కోల్పోతున్న భూ యజమానులు శనివారం ఆందోళనకు దిగారు. బై పాస్ రోడ్డు సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. రెండు పంటలు పండే తమ విలువైన భూములను బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేదేలేదంటూ తేల్చి చెప్పారు. దీంతో అధికారులకు రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. రైతులు ససేమిరా అనడంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరెపల్లి శివారు ఇస్కాన్ టెంపుల్‌కు సమీపంలో జాతీయ రహదారి 163 అనుసంధానం చేస్తూ ఇంటర్నల్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)ను కుడా మాస్టర్ ప్లాన్ 2041లో ప్రతిపాదించారు. మళ్లీ పైడిపల్లి నుంచి ఆరెపల్లి మీదుగా కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు మరొక బైపాస్ రోడ్డును ప్రతిపాదించడంతో విలువైన తమ పంటపొలాల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేకు, ఒక స్కూల్, ఆస్పత్రి యాజమాన్యానికి, కొందరు రాజకీయ నేతలు, వ్యాపారులకు మేలు చేసేలా బైపాస్ రోడ్డును పచ్చని పంట పొలాల మధ్య నుంచి వేయడానికి ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఐఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేస్తూ బై పాస్ రోడ్డును నిర్మిస్తామని కుడా అధికారులు చెబుతున్నప్పటికీ ఈ రోడ్డును ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేయకుండా ఓ ఆస్పత్రి వెనుక నుంచి సుమారు 90 డిగ్రీల వంక (క్రాస్)తో అశాస్త్రీయంగా జాతీయ రహదారికి కలిపే ప్రయత్నం చేయడం వెనుక అనుమానులకు తావిస్తోందన్నారు. వరంగల్ ఆర్డీవో, తహసీల్దార్ గతంలో విడుదల చేసిన సర్వే నెంబర్లతో కూడిన భూ సేకరణ జాబితా ప్రకారం కాకుండా, కొత్తగా రెండు సార్లు మార్కింగ్ మార్పు చేయడం వెనుక అధికారుల అవినీతి దాగుందని రైతులు ఆరోపించారు. గతంలో జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ రైతుల పంట పొలాలు పోయాయని, మాస్టర్ ప్లాన్ 2041లో మళ్లీ 200 ఫీట్ల బై పాస్ రోడ్డు, 300 ఫీట్ల ఓర్ఆర్ఆర్ ను ప్రతిపాదించడంతో ఎక్కువ మొత్తంలో తమ పంట పొలాలను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. రైతులకు, మధ్య, పేద తరగతి ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చే విధంగా అశాస్త్రీయంగా రూపొందించిన బై పాస్ రోడ్డుకు ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇవ్వబోమని, బై పాస్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట తదితర గ్రామాల రైతుల, నివాస స్థలాల వారు పాల్గొన్నారు. బైపాస్ రోడ్డును రద్దు చేయాలి

### కుడా వైస్ చైర్మన్‌కు వినతి..

పైడిపల్లి నుంచి ఆరెపల్లి మీదుగా కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు ప్రతిపాదించిన బై పాస్ రోడ్డుతో తమ పంట పొలాలు నష్టపోనున్నాయని, ప్రతిపాదిత బైపాస్ రోడ్డును రద్దు చేయాలని ఆరెపల్లి, పైడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ (కుడా) వైస్ చైర్మన్ అశ్వినీని కోరారు. ఈ మేరకు శనివారం ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నెమరగొమ్ముల వెంగళ్‌రావు, బుద్దె గణేశ్, శ్రీనివాస్, సుంకరి ప్రశాంత్, రామెందర్ రెడ్డి, బుద్దె కృష్ణమూర్తి, జితేందర్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల నుంచే ప్రపంచ స్థాయి క్రీడాకారుల తయారి

- అందుకే సీఎం కప్ టోర్నమెంట్
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** పల్లెల నుంచే ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ టోర్నమెంట్ ను నిర్వహిస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ – 2024 ముగింపు, బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హాబ్ గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, యువత సోషల్ మీడియా, ఇతర వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రయత్నించి ఓడిపోవచ్చు కానీ... ప్రయత్నించకుండా ఓడిపోకూడదని అన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని అప్పుడే మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటామని తెలిపారు. ముఖ్యంగా బాలికలు క్రీడల్లో రాణించాలంటే మంచి న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలని సూచించారు. ఇప్పుడు జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో, అక్కడ గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు. విద్యార్థులు, క్రీడాకారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడాలలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జఫర్ గడ్ మండలం కునూరులో..

జఫర్ గడ్ మండలం కునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులందరూ కలిసి నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ కావ్య మాట్లాడుతూ బాల్యం అంటేనే ఒక మధుర స్మృతి అన్నారు. ఇంత గొప్పగా పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించిన కమిటీ సభ్యులకు, పూర్వ విద్యార్థులకు కావ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారి మృతి

## రేణుకుంట నాగభూషణంకు పలువురి సంతాపం



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి రేణిగుంట నాగభూషణం (95)శుక్రవారం రాత్రి మృతి చెందారు. 1975 వరకు అడ్తి వ్యాపారంలో రాణించిన నాగభూషణం అనంతరం కిరాణా వ్యాపారం ప్రారంభించి ఆ రంగంలోనూ రాణించారు. వీరి మరణం పట్ల వార్డు కౌన్సిలర్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రేమలతారెడ్డి, స్థానిక ప్రముఖులు సంతాపం ప్రకటించారు. దివంగత వ్యాపారికి భార్య, ముగ్గురు కుమారులు క్రిష్ణ, శ్రీనివాస్, మధుసూదన్ ఇరువురు కుమార్తెలు కళావతి, విజయలక్ష్మి ఉన్నారు. చిన్న కుమారుడు అమెరికా నుంచి బయలు దేరారు కనుక నాగభూషణం అంత్యక్రియలు ఆదివారం ఉదయం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పెద్ద కుమారుడు క్రిష్ణ తెలిపారు. పితృ వియోగానికి గురైన లయన్ కృష్ణ కుటుంబ సభ్యులకు పలువురు లయన్ ప్రముఖులు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశు రాములు, నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్, మహేశ్వర్, పజ్జూరి లక్ష్మి నర్సయ్య, టి.వెంకటమల్లారెడ్డి తదితరులు శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఉన్నారు.



# అవార్డు గ్రహీతలకు సన్మానం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అలయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో వివిధ సామాజిక రంగాల్లో అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. శనివారం కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవనంలో అలయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్, చైతన్య క్లబ్బుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బహుజన సమాజానికి వివిధ సేవలు అందించినందుకు గాను బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వరంగల్ డిస్ట్రిక్ట్–192 గవర్నర్ అలై చిప్ప వెంకటేశ్వర్లు, వివిధ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా సేవలందిస్తున్న క్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ద్వారా భారత సేవారత్న అవార్డు గ్రహించిన వరంగల్ డిస్ట్రిక్ట్–192 మాజీ గవర్నర్ అలై కుసుమ లింగమూర్తి, ఈ మధ్య జరిగిన అఖిలభారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం వరంగల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అలయన్స్ క్లబ్స్, వరంగల్ జిల్లా మల్టిపుల్ కోఆర్డినేటర్ గజ్జెల ఓంకార లింగం శాస్త్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ మంత్రి లింగమూర్తి, అలయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షులు దోమల నాగేందర్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పెండెం మానస, డిస్ట్రిక్ కేబినెట్ సెక్రటరీ పెంట కుమార్, కోర్ కమిటీ మెంబర్ ఆడెపు రవి, డిస్ట్రిక్ట్ మైక్రో కేబినెట్ మెంబర్ పరికిపండ్ల రాంబాబు, జోనల్ చైర్మన్ ఎండి. దస్తగీర్, ఇంకా క్లబ్ లీడర్స్ పోరండ్ల సతీష్ కుమార్, గాదె రాధిక, చిప్ప లక్ష్మి, మేరుగు సుజాత, తాటిపాముల స్రవంతి, గజ్జెల కావ్య, ఏల మంజుల, కుసుమ వాణిశ్రీ, పెంట జ్యోతి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేయాలి

## అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును శనివారం పరకాల మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ప్రకారం గ్రామ పంచాయతీలో సమర్పించిన దరఖాస్తులు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తున్న తీరును అదనపు కలెక్టర్ అడిగి తెలుసున్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోకుంటే వారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ కె.నారాయణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ శైలజ, పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com